

బీసీల అభివృద్ధికి కృషి

బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. 8లో▸



అగ్ని ప్రమాదాల నివారణకు

అగ్ని ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్లు షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. 8లో▸



న్యాయం చేయాలని..

కోర్టు ఉత్తర్వులు వచ్చినా న్యాయం జరగ లేదని ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట హల్‌చల్ చేశాడు. 8లో▸

న్యూస్‌రీల్

కన్హాలో అమీర్‌ఖాన్



కమ్లేష్ డి పటేల్‌తో సినీనటుడు అమీర్‌ఖాన్

నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతి వనాన్ని బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్‌తో కలిసి ధ్యానం చేశారు. అనంతరం ఆయన నటించిన హిందీ మూవీ 'సితారే జమీన్ పర్'లోని విశేషాలపై చర్చించుకున్నారు. ధ్యానం, మనస్సు, ఏకాగ్రత తదితర వాటితో విద్యార్థులు, యువతకు కలిగే ప్రయోజనాలకు సంబంధించి ఈ సినిమాలో అనేక సన్నివేశాలు ఉన్నాయని అమీర్‌ఖాన్ వివరించారు.

గ్రామాలన్నీ స్వచ్ఛంగా ఉండేలా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

కందుకూరు: గ్రామాలన్నీ స్వచ్ఛంగా ఉండేలా పరిసరాలను పరిశుభ్రం చేయించాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి సూచించారు. మండల పరిషత్ సమావేశ హాల్‌లో శుక్రవారం డీపీఓ సురేష్‌మోహన్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ), స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్, వన మహోత్సవం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యం మేరకు వర్షాకాలంలో మొక్కలు నాటించాలని అరు. వర్షపు నీరు ఇంకేలా అవసరమున్న చోట గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. పీఏఐ ప్రకారం శాఖల వారీగా సమాచారం సేకరించి ప్రశ్నా పత్రంలో నింపాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుధారాణి, డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఓటీ పత్తి విత్తనాలు రోలర్‌తో తొక్కించి ధ్వంసం



నందిగామ: మండల కేంద్రంలోని నూజివీడు సీడ్స్ పరిశ్రమలో గ్రో అవుట్ టెస్ట్ (జీఓటీ)లో వైఫల్యం చెందిన 1,210 క్వింటాళ్ల పత్తి విత్తనాలను శుక్రవారం రోడ్డు రోలర్ సాయంతో తొక్కించి ధ్వంసం చేశారు. పరిశ్రమలో 2020 నుంచి 2023 వరకు నిల్వ ఉన్న విత్తనాలను ధ్వంసం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ రాజేశ్వర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఓ రామ శివరావు, షాద్‌నగర్ టెక్నికల్ ఏఓ శోభారాణి సమక్షంలో వాటిని నిర్వీర్యం చేశారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశ్రమను సందర్శించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



లక్డీకాపూల్: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, రఘు ప్రసాద్, గీతా రాధిక, వేణుగోపాల్, సీతం రత్నాకర్, చీఫ్ అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రైతులకు శుభవార్త!

సోమవారం నుంచి ప్లాట్ల పంపిణీ

- ఇప్పటికే ప్రొసీడింగ్స్ ఇచ్చిన అధికారులు
- తాజాగా ప్లాట్ నంబర్ల కేటాయింపు డ్రాకు ఏర్పాట్లు
- ఎకరానికి 121 గజాల చొప్పున ఇంటిస్థలం కేటాయింపు
- మీర్‌ఖాన్‌పేటలో 642 ఎకరాల్లో లేఅవుట్, 5,480 మందికి లబ్ధి



మీర్‌ఖాన్‌పేటలో ప్లాట్లకు హద్దురాళ్లు పాతి వేసిన నంబర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇళ్లస్థలాలు కేటాయింపు, రిజిస్ట్రేషన్ల అంశం కొలిక్కి వచ్చింది. ఇప్పటికే లే అవుట్ రూపకల్పన, రోడ్లు, కరెంట్ లైన్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం సహా డ్రైనేజీ పనులను ప్రారంభించింది. ప్లాట్లకు హద్దురాళ్లు నాటి వాటికి నంబరింగ్ ప్రక్రియను సైతం పూర్తి చేసింది. సోమవారం నుంచి దశల వారీగా ఎంపిక చేసిన లబ్ధిదారులందరికీ లాటరీ పద్ధతిలో ఇళ్ల స్థలాలను కేటాయించనుంది. తర్వాత సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్స్ బుక్ చేసి ఆయా లబ్ధిదారుల పేరున ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయనుంది. మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా సిద్ధం చేసిన లే అవుట్‌ను శుక్రవారం ఇబ్రహీంపట్నం, కందుకూరు రెవెన్యూ డివిజన్ అధికారులు సం దర్శించి, పనులను పర్యవేక్షించారు.

పొజిషన్‌కు రంగం సిద్ధం

ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం కందుకూరు, కడ్తాల్, యాచారం మండలాల్లో 19,333 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఆ మేరకు 13,972 ఎకరాలు సేకరించింది. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారంగా పట్టా భూములకు రూ.16.5 లక్షల చొప్పున, అసైన్డ్ భూములకు రూ.8.5 లక్షల చొప్పున చెల్లించింది. మీర్‌ఖాన్‌పేట్ (సర్వే నంబర్ 120) సహా పంజాగూడ (సర్వే నంబర్ 90లో) ప్రభుత్వం 642 ఎకరాల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) అభివృద్ధి చేసిన లే అవుట్‌లో ఎకరానికి 121 గజాల చొప్పున నివాస స్థలాన్ని కేటాయించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో



లబ్ధిదారుల కోసం వేసిన రోడ్లు

1,580 మంది, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో 3,900 మంది లబ్ధిదారులను గుర్తించి, వారికి అప్పట్లోనే ప్రొసీడింగ్స్ జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దాని స్థానంలో ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొంది. మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఇటీవల యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసింది. భూములు ఇచ్చిన రైతులకు ప్రొసీడింగ్స్ చేతికిచ్చి నెలలు గడుస్తున్నా.. ప్లాట్ నంబర్లు కేటాయించకపోవడం, వారి పేరున ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో లబ్ధిదారుల్లో ఒకింత ఆందోళన మొదలైంది. తమకు ప్లాట్ నంబర్లు కేటాయించాల్సిందిగా కోరుతూ కొంతకాలంగా వారి నుంచి డిమాండ్ ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు పొజిషన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది.

లాటరీ తర్వాత రిజిస్ట్రేషన్లు

భూములు కోల్పోయిన రైతుల్లో అర ఎకరం మొదలు ఐదు ఎకరాలకుపైగా ఉన్న రైతులు ఉన్నారు. 40 గుంటల లోపు భూములు కోల్పోయిన రైతుకు 60 గజాల చొప్పున ప్లాట్ ఇవ్వనున్నారు. ఎకరం భూమిని కోల్పోయిన వారికి 121 గజాల చొప్పున, ఎకరం నుంచి రెండు ఎకరాలలోపు వారికి 181 గజాల చొప్పున ఇవ్వనున్నారు. ఐదు ఎకరాలు కోల్పోయిన రైతుకు 600 గజాల వరకు ఇవ్వనున్నారు. ఇప్పటికే వీరందరికీ ప్రొసీడింగ్స్ అందజేసినప్పటికీ ప్లాట్లు కేటాయించలేదు. లబ్ధిదారుల్లో ఉమ్మడి కుటుంబాలు కూడా ఉన్నాయి. వీరిలో కొంత మంది తమకు నష్టపరిహారంగా ఇచ్చే భూమిని ఒకేచోట కేటాయించాలని కోరగా, మరి కొంత మంది వేర్వేరు ప్లాట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికే ఆయా గ్రామాల్లో పర్యటించి, భూములు కోల్పోయిన రైతులను స్వయంగా కలిశారు. ఫ్యామిలీ ట్యాగింగ్‌కు అంగీకరించిన వారందరికీ ఒకేచోట.. నిరాకరించిన వారికి విడివిడిగా ప్లాట్లు కేటాయించేందుకు ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులను కేటగిరీల వారీగా విభజించి, డ్రా షెడ్యూల్‌ను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికానుంది. ఆ వెంటనే కేటగిరీల వారీగా అభివృద్ధి చేసిన లే అవుట్ వేదికగా లబ్ధిదారుల సమక్షంలో పటిష్టమైన నిఘా మధ్య లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. నంబర్ల కేటాయింపు తర్వాత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్స్ బుక్ చేసి లబ్ధిదారుల పేరున ఆయా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయనున్నారు.



కనకమామిడిలో వేస్తున్న ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

సర్కారు భూములకు రక్షణ

- రంగంలోకి రెవెన్యూ అధికారులు
- ఫెన్సింగ్ వేసే పనులు మరూ
- మొదటి విడత మొయినాబాద్‌లో 300 ఎకరాలకు..

మొయినాబాద్: కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. మొదటి విడతలో మండలంలోని 300 ఎకరాల సర్కారు భూములకు ఫెన్సింగ్ వేస్తున్నారు. నగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిపై కొందరు ఆక్రమణదారుల కన్ను పడడంతో కబ్జాలకు గురవుతున్నాయి. ఇప్పటికే కొన్ని భూములను దర్జాగా కబ్జాచేసి ప్రీకాస్ట్‌వాల్స్, నిర్మాణాలు చేపట్టగా అధికారులు కొరడా ఝుళిపించారు. కబ్జా గురైన భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి వాటిని స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు. కొందరు కబ్జారాయుళ్లు అధికారులపైనే కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. ఈ క్రమంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడకపోతే పూర్తిగా కబ్జాకు గురవుతాయని భావించిన రెవెన్యూ యంత్రాంగం వాటిని రక్షించేందుకు పూనుకుంది. అందులో భాగంగానే చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పెడుతున్నారు.

రెండు నెలలుగా సర్వే

మొయినాబాద్ మండలం కనకమామిడి, తోలుకట్ట, పెద్దమంగళారం, చిలుకూరు, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, సురంగల్ తదితర గ్రామాల్లోని 300 ఎకరాల ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేసే పనులను మొదలు పెట్టారు. కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ ఆదేశాల మేరకు రెండు నెలలుగా ఆయా గ్రామాల్లో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, సర్వేయర్ జలజ, ఆర్ఐలు రోజా, రాజేష్ పర్యటించి సర్వే చేపట్టారు. డిజిటల్ మ్యాప్‌లు తయారు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఫెన్సింగ్ వేసే పనులు మొదలు పెట్టారు.

కబ్జాకు యత్నిస్తే క్రిమినల్ కేసులు

కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడటమే లక్ష్యంగా రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తోందని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి సర్వే నంబర్ 510లో ప్రభుత్వ భూమి చుట్టూ వేస్తున్న ఫెన్సింగ్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న మొయినాబాద్‌లో విలువైన ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని కాపాడటం కోసం కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాచేయడానికి ఎవరు ప్రయత్నించినా క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. మొదటి విడతలో 300 ఎకరాల ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. మిగతా వాటికి రెండో విడతలో కంచె ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఆర్ఐ రాజేష్, సిబ్బంది భాస్కర్ ఉన్నారు.



మొండిగౌరెల్లిలో పుదీనా పంటను పరిశీలిస్తున్న ముదిరెడ్డి కోదండరెడ్డి, సభ్యులు

కూరగాయల హబ్‌గా మారుస్తాం

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి

యాచారం: మహా నగరం చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాను కూరగాయల, ఆకుకూరల హబ్‌గా మార్చడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి పేర్కొన్నారు. కూరగాయలు, ఆకుకూరల సాగు పెంపు కోసం రైతు కమిషన్ పైలెట్ కింద ఎంపిక చేసిన మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయనతో పాటు సభ్యులు గోపాల్‌రెడ్డి, కేవీఎన్ రెడ్డి, గంగాధర్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమల శాఖ అధికారి సురేష్ పర్యటించారు. మొండిగౌరెల్లిలో పుదీన, పలు రకాల ఆకుకూరలు పండిస్తున్న రైతులను కలిసి పెట్టుబడులు, ఆదాయం, మార్కెట్‌కు తరలింపు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. చౌదర్‌పల్లిలో ఆదర్శ రైతు కాశమల్ల రాములు వ్యవసాయ క్షేత్రంలో యంత్రాల ద్వారా సాగు చేస్తున్న పద్ధతిని పరిశీలించారు. కూరగాయల సాగులో జిల్లా రైతులు సీఎం రేవంత్‌రెడ్డి మనసును దోచినట్లు తెలిపారు. కాగా, మొండిగౌరెల్లి గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో కలుపుతామని, రైతుల్లో ఆందోళన అవసరం లేదని కోదండరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న డీసీపీ రాజేష్

శంషాబాద్ డీసీపీ రాజేష్

కొత్తూరు: ప్రజల సహకారంతోనే పూర్తిస్థాయిలో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు. కొత్తూరు పట్టణంలో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం పలు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్‌లాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణంలో చేపట్టిన తనిఖీల్లో సరైన ధ్రువీకరణ లేని వాహనాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని, అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న దుకాణాల్లో సిలిండర్లు, పెంజర్ల రోడ్డులోని ఓ టీకొట్టులో సుమారు 84 గంజాయి చాక్లెట్లు, ఆయా పాన్‌డబ్బాలు, కిరాణా దుకాణాల్లో సుమారు 10 కిలోల గుట్కాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్థానికంగా రౌడీషీటర్లు, సస్పెక్టెడ్ షీటర్ల వివరాలు, వారి కదలికలను తెలుసుకున్నట్లు వెల్లడించారు. పలువురికి డ్రగ్స్ పరీక్షలు సైతం నిర్వహించినట్లు తెలిపారు. కొత్తూరుతో పాటు సమీప మండలాల్లో పారిశ్రామికవాడ ఉండడంతో బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌తో పాటు ఆయా రాష్ట్రాలకు చెందిన వలసదారులు స్థానికంగా నివాసం ఉంటున్నారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరినైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, కొత్తూరు సీఐ నర్సింహారావు, ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ గుబులు

- నగర శివారులోకి డంపింగ్ యార్డు?
- బండరావిరాలలో భూముల పరిశీలన
- ఆందోళనలో ఆయా గ్రామాల ప్రజలు
- ఏర్పాటు చేస్తే పోరాడాలని సోషల్‌మీడియాలో సందేశాలు

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రేటర్ హైదరాబాద్‌లోని చెత్త సమస్యను పరిష్కరించడంలో భాగంగా మండలంలోని బండరావిరాల మైనింగ్ జోన్ పరిధిలో భారీ డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి మైనింగ్ జోన్‌లోని భూముల్లో డంపింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. నగరానికి ఆనుకుని ఉన్న జిల్లాతో పాటు సమీప యాదాద్రి భువనగిరి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న భూములను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే పక్షం రోజులుగా జీహెచ్ఎంసీ అధికారులు అనుమానం రాకుండా నిత్యం తెల్లవారుజామున, సాయంత్రం వేళ స్థలాలను పరిశీలిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఇప్పటికే మైనింగ్ జోన్‌తో కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్న తమకు డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే చావే శరణ్యమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు చేపడితే మాత్రం ఆందోళన బాట పట్టాల్సిందేనని సోషల్ మీడియాలో సందేశాలు పంపించుకుంటున్నారు.

వాహనాల చక్కర్లు

బండరావిరాల సర్వేనంబర్ 268లో సుమారు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో 670 ఎకరాల వరకు మైనింగ్ జోన్‌కు ప్రభుత్వం కేటాయించింది. మిగిలిన భూముల్లో డంపింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన రానప్పటికీ కొన్ని రోజులుగా అధికారులకు సంబంధించిన వాహనాలు మైనింగ్ జోన్ పరిసరాల్లో చక్కర్లు కొడుతుండడం ప్రచారానికి ఊతమిస్తోంది.



బండరావిరాలలో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం అధికారులు పరిశీలించిన భూములు

ఆ గ్రామాలకు ముప్పే..

డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వస్తే మండలంలోని బండరావిరాల, చిన్నరావిరాల, గువ్వలేటి, తారామతిపేట, సద్దుపల్లి, బాచారం, గౌరెల్లి, కవాడిపల్లి గ్రామాలతో పాటు యాదాద్రి జిల్లాలోని పిల్లాయిపల్లి, దేశ్‌ముఖి పరిసర ప్రాంతాలకు ముప్పేనని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బండరావిరాలలో మైనింగ్ జోన్‌లో ఉన్న సహజ సిద్ధమైన కొండలు, గుట్టలను కంకర మిషన్లు ఇప్పటికే పిండి చేశాయి. వీటి కారణంగా గ్రామాల్లో విపరీతమైన దుమ్ము, ధూళితో పాటు వాతావరణ కాలుష్యంతో ప్రతి రోజు నరకం చూస్తున్నామని, దీనికి తోడు డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడనుందని స్థానికులు వాపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు కాకుండా రాజకీయాలకు అతీతంగా పోరాడాలని ఆయా గ్రామాల ప్రజలు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

సహించేది లేదు

బండరావిరాలలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ఇప్పటికే మైనింగ్ జోన్‌తో బతుకులు ఆగమయ్యాయి. మైనింగ్ జోన్ ఎత్తివేయాలని పోరాటం చేస్తుంటే డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని చూస్తే సహించేది లేదు. తక్షణమే నిర్ణయాన్ని మార్చుకోవాలి.

– కొత్త కిషన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

పార్టీలకు అతీతంగా..

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని చూస్తే రాజకీయాలకు అతీతంగా పోరాడుతాం. మైనింగ్ జోన్‌తో పదుల సంఖ్యలో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటుపై పునరాలోచన చేసి ప్రజలకు దూరంగా ఉండే మరో ప్రాంతాన్ని ఎంపిక చేస్తే బాగుంటుంది.

– కొత్త ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

రోహింగ్యాల నుంచి ప్రాణహాని

పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నేత అందెల శ్రీరాములు ఫిర్యాదు

మీర్‌పేట: రోహింగ్యాల నుంచి తనకు ప్రాణహాని ఉందని, తన ఇంటి వద్ద అనుమానాస్పదంగా మారణాయుధాలతో సంచరిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. స్టేషన్ ఆవరణలో జిల్లా, స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని నాదర్‌గుల్ విజయలక్ష్మీనగర్‌లోని తన ఇంటి ముందుకు వచ్చి నిలిపాడని, తాను గమనించి వివరాలు అడుగ్గా సమాధానం ఇవ్వకుండా వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడని తెలిపారు. అనంతరం బైకు వెనుకాల ఉన్న ట్రాలీని పరిశీలించగా పెట్రోలు బాటిల్, సుత్తి, కట్టర్, ఇనుపరాడ్ ఉన్నాయని చెప్పారు. కొంత కాలంగా బాలాపూర్ మండలంలో నివసిస్తున్న రోహింగ్యాలతో భవిష్యత్తులో ప్రమాదం ఉంటుందని, వారిని ఇక్కడి నుంచి తరలించాలని ప్రచారం చేస్తున్నానని వివరించారు. అందుకే రోహింగ్యాలు తనను చంపాలనే ప్రయత్నంలో భాగంగానే తన ఇంటి వద్దకు పెట్రోలు, సుత్తి, ఇనుపరాడ్‌లతో వచ్చినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అందెల వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, గాజుల మధు ఉన్నారు.



పార్టీ నాయకులతో కలిసి మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

విచారణ చేపడుతున్నాం..

ఆరుగురు రోహింగ్యాలను అదుపులోకి తీసుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. శ్రీరాములు ఇంటి వద్దకు వచ్చిన యువకుడు చెత్తను సేకరించే వాడని, అదే ప్రాంతంలో గుర్తించిన మరో ఐదుగురు మంగళపల్లిలోని ఓ భవన నిర్మాణంలో మేస్త్రీ పనులు చేస్తున్నట్లు గుర్తించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు చెప్పారు.

బీసీల అభివృద్ధికి సమష్టి కృషి



షాబాద్: రుద్రారంలో మధుకు నియామక పత్రం అందజేస్తున్న బర్క కృష్ణ తదితరులు

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: బీసీలు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా మధు, ఉపాధ్యక్షుడిగా పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా సుభాన్, సభ్యులుగా కృష్ణ, జనార్దన్, రమేశ్ ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. దేశ జనాభాలో 50 నుంచి 60 శాతం వరకు బీసీలు ఉన్నప్పటికీ రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారన్నారు. ఆధిపత్య వర్గాలతోనే బీసీలు అన్ని రంగాల్లో వెనుక బడుతున్నారని ఆరోపించారు. ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి బీసీలను బలోపేతం చేస్తున్నామన్నారు. బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందని, హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దీనికోసం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాణిక్యం, నాయకులు స్వామి, బాల్‌రాజ్, గణేష్, మల్లేష్, కృష్ణ, కుమార్, ప్రభాకర్, యాదగిరి, గోపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి

కేశంపేట: మహిళలు రాజకీయాల్లో రాణించాలని బీసీ సేన జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీసీ సేన మహిళ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా మండల కమిటీని ఎంపిక చేశారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. బీసీలు రాజకీయాల్లో వచ్చి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. బీసీలందరూ ఏకమై రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి బీసీ నినాదంతో ముందుకువెళ్లాలని సూచించారు. మండల కమిటీ అధ్యక్షురాలిగా వనమ్మ, ఉపాధ్యక్షులుగా శ్రీలత, కవిత, ప్రధాన కార్యదర్శులుగా అనూష, మాధవి, కార్యదర్శులుగా అశ్విని, భవాని, కోశాధికారిగా ధనరేఖలను ఎన్నుకొని నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, సభ్యులు లింగమ్మ, యాదమ్మ, పుణ్యవతి, నాగమణి, సుచరిత, పరమేశ్వరి, కృష్ణమ్మ, రేణుక, అఖిల తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలలో మౌలిక వసతులు కల్పించండి

మంచాల: ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి కొప్పుల సుమలత పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డాక్టర్ శ్రావణ్ కుమార్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైద్యశాలకు మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు వస్తారన్నారు. వారికి తాగునీటితో పాటు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇప్పటికే వైద్యశాల పైకప్పు వర్షాలకు నీరు లీకేజీ కావడంతో కురుస్తుందన్నారు. రోగులకు ఇబ్బందుల్లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకురాలు పగుడాల విజయ తదితరులు పాల్గొన్నారు.

జారిపడి పెయింటర్ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: గోదాంలో పెయింటింగ్ పని చేస్తుండగా వలస కార్మికుడు జారి పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ శివారులోని గోడౌన్‌లో పెయింట్ పని చేస్తుండగా బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ హతీబ్(27) జారి పడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

థానేలో ఎస్కేప్.. సిటీలో అరెస్టు!

మహారాష్ట్రలోని అనేక నగరాలకు డ్రగ్ సరఫరా

- ప్రధాన సూత్రధారిగా ఉన్న మహ్మద్ రహీమ్
- నగరం మీదుగా విదేశాలకు పారిపోయే యత్నం
- శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: మహారాష్ట్రలోని థానే కేంద్రంగా సాగిన అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్‌లో కీలక నిందితుడు మహ్మద్ రహీమ్ షేక్ అలియాస్ ఫర్హాన్ శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులకు చిక్కాడు. గత నెల 25 నుంచి పరారీలో ఉండి, బహ్రేన్ పారిపోయే ప్రయత్నాల్లో ఉన్న ఇతగాడిని మాన్‌పడా పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఫర్హాన్ నేతృత్వంలో ఏర్పడిన గ్యాంగ్ థానే కేంద్రంగా పని చేసింది. మాదకద్రవ్యమైన మెఫెడ్రోన్‌ను మహారాష్ట్రలోని వివిధ నగరాలు, పట్టణాల్లోని పెడ్లర్స్‌కు సరఫరా చేసింది. కొన్నేళ్లుగా గుట్టుగా సాగుతున్న ఈ దందాపై గత నెల్లో థానేలో ఉన్న మాన్‌పడా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ ముఠా వ్యవహారాలపై కన్నేసి ఉంచిన అధికారులు గత నెల 25న అక్కడి ఖోనీ ప్రాంతంలో దాడి చేశారు. ఓ మహిళ సహా ఐదుగురిని పట్టుకున్నారు. వీరి నుంచి రూ.2.12 కోట్ల విలువైన 1.93 కేజీల మెఫెడ్రోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్యాంగ్ విచారణలోనే ఫర్హాన్ పేరు వెలుగులోకి వచ్చింది. డ్రగ్ అతడి ద్వారానే తమకు అందుతుందని, విక్రయించగా వచ్చిన సొమ్ములో తమ కమీషన్ పోను మిగిలింది అతడికే అప్పగిస్తామని గ్యాంగ్ మెంబర్స్ బయటపెట్టారు. దీంతో ఫర్హాన్ కోసం పోలీసుల వేట ముమ్మరమైంది. తన ముఠా పోలీసులకు చిక్కిన విషయం తెలుసుకున్న ఫర్హాన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. విదేశీ లింకులు ఉన్న ఇతగాడు దేశం దాటి వెళ్లేపోయే అవకాశం ఉందని అనుమానించిన థానే పోలీసులు దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల వద్దా కన్నేసి ఉంచారు. ఫర్హాన్ పాస్‌పోర్ట్ నెంబర్ ఆధారంగా అతడిపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) కూడా జారీ చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బహ్రేన్ వెళ్లిపోవడానికి ఫర్హాన్ ప్రయత్నించాడు. ఈ విషయంపై ఉప్పందుకున్న థానే పోలీసులు నగరానికి చేరుకుని ఎయిర్‌పోర్టు మార్గాల్లో నిఘా ఉంచారు. ఓ వాహనంలో విమానాశ్రయం వైపు వస్తున్న ఫర్హాన్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడిని అరెస్టు చేసిన థానే పోలీసులు అక్కడకు తరలించి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు.

న్యాయం చేయాలని అర్ధనగ్న ప్రదర్శన

అక్రమంగా భూమిని బదలాయించారని ఆరోపణ



మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: కోర్టు ఉత్తర్వులు వచ్చినా తనకు న్యాయం జరగలేదని ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట హల్‌చల్ చేశారు. అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేసిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌లో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. నగరంలోని సైదాబాద్‌లో నివాసముంటున్న గిరిధర్‌రెడ్డికి మండల పరిధిలోని తట్టి అన్నారంలో ఉన్న భూమి విషయంలో కోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నప్పటికీ కొన్నేళ్లుగా తనకు న్యాయం జరగడం లేదని ఆరోపిస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అధికారి తనకు ఎలాంటి నోటీసులు లేకుండా భూమిని అక్రమంగా ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. తట్టిఅన్నారం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 109, 110లలో 6 ఎకరాల భూమి ఉందని, సంవత్సరాల నుంచి ఎదురు చూసినా తనకు న్యాయం జరగడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని గిరిధర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

యువతి అదృశ్యం



లక్ష్మీప్రసన్న (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ సర్దార్‌నగర్‌కు చెందిన రెడ్డిగళ్ల రత్నం కుమార్తె లక్ష్మీ ప్రసన్న(22) విద్యార్థి. గత జూన్ 30వ తేదీన ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిన ప్రసన్న తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా జాడ తెలియలేదు. యాచారం ప్రాంతానికి చెందిన అంకని సాయికుమార్ తీసుకెళ్లి ఉంటాడని ఆమె తల్లి రాజ్యలక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

లారీ, కారు ఢీ

ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న సీఐ

కొత్తూరు: లారీ–కారు ఢీకొని ఐదుగురు గాయపడిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధి తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ కూడలిలోని హెచ్‌ఐఎల్ పరిశ్రమ ఎదురుగా శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. షాద్‌నగర్ పట్టణానికి చెందిన అవినాష్‌గౌడ్, శ్రావణి, వినయ్, నవీన్‌గౌడ్, కారు డ్రైవర్ శివకృష్ణలతో కలిసి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉద్యోగం చేస్తున్న సంస్థకు బయలు దేరారు. మార్గమధ్యలో తిమ్మాపూర్ శివారు హెచ్‌ఐఎల్ పరిశ్రమ ఎదురుగా రోడ్డుపై నిలిపిన లారీను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: అగ్ని ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫంక్షన్ హాల్స్, బార్ అండ్ రెస్టారెంట్స్, లాడ్జీ, హోటల్స్, హాస్టల్స్ యజమానులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల నివారణకు అందరూ తగిన విధంగా కృషి చేయాలని సూచించారు. వ్యాపారులు తప్పనిసరిగా మున్సిపల్, అగ్నిమాపక శాఖ అనుమతులు విధిగా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్సు, రెంటల్ డీడ్, లీజ్ అగ్రిమెంట్, వైద్య, ఆరోగ్య శాఖ, ఎన్‌ఓసీ, పోలీస్ శాఖల నుంచి విధిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అధికంగా వచ్చే వ్యాపార కేంద్రాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు శరత్‌కుమార్, సుశీల, ప్రణయ్, నరేందర్, శ్రీకాంత్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు



కొడంగల్‌లో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీజీపీ జితేందర్

- గంజాయి రహిత రాష్ట్రంగా తెలంగాణ
- డీజీపీ జితేందర్

కొడంగల్: తెలంగాణను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. శుక్రవారం కొడంగల్‌లో సీఐ కార్యాలయానికి, కొడంగల్, దుద్యాల్, బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ల నూతన భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి, గంజాయి చాక్లెట్లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి మత్తు పదార్థాలు తెస్తున్న వారిపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. వ్యసనాలకు గురికావడం వల్ల కుటుంబాలు చెల్లాచెదురవుతాయని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. బొంరాస్‌పేటలో పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణానికి రూ.2.96 కోట్లు, దుద్యాల్ పోలీస్‌స్టేషన్‌కు రూ.3 కోట్లు, కొడంగల్ సీఐ కార్యాలయానికి రూ.85 లక్షలు,కొడంగల్ పోలీస్ స్టేషన్‌కు రూ.2.96 కోట్లు కేటాయించారు. అధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మిస్తామని డీజీపీ తెలిపారు. భవనాలను త్వరగా నిర్మించి అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసులు డీజీపీకి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఐజీ తాఫ్సీర్ ఎగ్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజీ రమేష్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, తహసీల్దార్ విజయ్ కుమార్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరాలతో ప్రశాంతత

మొయినాబాద్‌రూరల్: ప్రార్థనా మందిరాలు మానవుడికి మనశ్శాంతిని కలిగిస్తాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మెథడిస్ట్ చర్చి ప్రార్థనలను బిషప్ ఏ.సిమోయిన్ నిర్వహించగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, రత్నం, అనంతరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో పాటు మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని సంపాదించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్, ఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు పోచయ్య, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, నాయకులు శేఖర్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకుని మృతిచెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సోమయ్య కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా తిరుమలగిరికి చెందిన రంగబాబు(40) తన భార్య, కుమారుడితో కలిసి తుర్కయంజాల్‌లోని లక్ష్మీ గార్డెన్‌లో నివాసం ఉండేవాడు. గత కొద్ది రోజులుగా ఏ పనీ చేయకుండా ఉంటున్న రంగబాబు మద్యం, కల్లుకు బానిసయ్యాడు. శుక్రవారం ఉదయాన్నే భార్య ఎప్పటిలాగే ఇళ్లల్లో పనిచేసేందుకు వెళ్లగా, కుమారుడు ఇంట్లో లేడు. పనిముగించుకున్న అనంతరం ఉదయం 10:30 గంటలకు భార్య ఇంటికి చేరుకోగా రంగబాబు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి దుర్మరణం



జంగయ్య మృతదేహం

ఇబ్రహీంపట్నం: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోల్కంపల్లికి చెందిన గుండ్ల జంగయ్య (56) కల్లు గీసేందుకు తాటి చెట్టి ఎక్కి, మోకు జారి పోవడంతో కింద పడ్డాడు. తలతో పాటు శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్లకు అరదండాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నమోదైన వేర్వేరు కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి వాట్సాప్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు భారీ లాభాలు వచ్చే ట్రేడింగ్ అంటూ నమ్మించారు. ఆపై ఆయన నుంచి రూ.67.60 లక్షలు కాజేసి మోసం చేశారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అధికారులు ఈ మొత్తంలో కొంత గుజరాత్‌కు చెందిన హార్దిక్ కుమార్ పేరుతో ఉన్న ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన బృందం అతడిని అదుపులోకి తీసుకుని విచారించింది. ప్రైవేట్ ఉద్యోగి అయిన ఇతగాడు స్క్రాప్ వ్యాపారి దేవ్‌రాజ్ భాయ్ కోరడంతో తన పేరుతో తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలు అందించినట్లు వెలుగులోకి వచ్చింది. దీని ద్వారా జరిగే లావాదేవీలపై కమీషన్ పొందుతున్నాడని తేలింది. దీంతో పోలీసులు దేవ్‌రాజ్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదే రకమైన మరో మోసంలో నగరవాసి నుంచి రూ.6.16 లక్షలు కాజేసిన కేసులో అకౌంట్ హోల్డర్‌గా ఉన్న ఉత్తరాఖండ్ వాసి మనీష్ కుమార్ శర్మనూ పోలీసులు పట్టుకున్నారు.

ఇలాచీల దొంగ అరెస్టు

సనత్‌నగర్: నగలు, నగదు దొంగలించేవారిని చూశాం..మొబైల్స్‌ను తస్కరించిన వారిని చూశాం. ఆఖరికి కేబుళ్లను చోరీ చేసిన వారినీ చూశాం. కానీ ఓ దొంగ విచిత్రంగా ఇలాచీలు దొంగిలించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదేమిటని పోలీసులు ప్రశ్నిస్తే ఇలాచీలు విలువైనవే కదా అంటూ సమాధానమివ్వడం గమనార్హం. సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలను సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం..సనత్‌నగర్‌లోని డీమార్ట్ షోరూంలో ఇటీవల 100 గ్రాముల ఇలాచీ ప్యాకెట్లు మాయమవుతున్నట్లు సిబ్బంది గుర్తించారు. ఓ రోజు సీసీ ఫుటేజీని తనిఖీ చేయగా ఓ వ్యక్తి ఇలాచీ ప్యాకెట్లను తీసుకుని వాష్‌రూమ్‌లోకి వెళ్లి లో దుస్తుల్లో దాచుకుని వెళ్తున్నట్లు వెల్లడైంది. అదే రోజు సాయంత్రం మళ్లీ సదరు వ్యక్తి షోరూంకు వచ్చి ఇలాచీ ప్యాకెట్లు ఉన్న చోటికి వెళ్లి మరో రెండు 100 గ్రాముల ఇలాచీ ప్యాకెట్లను తీసుకుని లో దుస్తుల్లో దాచుకున్నాడు. అతను తిరిగి వెళ్లిపోతుండగా సిబ్బంది పట్టుకుని సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో తన పేరు దీపక్ అని, క్యాటరింగ్ పనులు చేస్తుంటానని వెల్లడించారు. ఇలాచీలు ఖరీదు ఎక్కువని చోరీకి పాల్పడుతున్నట్లు తెలిపాడు. ఇప్పటివరకు పలుమార్లు షోరూంకు వచ్చి 100 గ్రాముల చొప్పున ప్యాక్ చేసి ఉన్న 22 ప్యాకెట్లను తస్కరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడిని అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.